క్లుప్తంగా

ఉపాధి పనులు వేగవంతం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పులిచెర్ల(కల్లూరు): మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. దేవళంపేట పంచాయతీలో జరుగుతున్న సప్లై చానల్ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో పనుల వద్ద కూలీలకు మంచినీరు, షెల్టర్ కల్పించాలని చెప్పారు. చిన్నచిన్న కుంటల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యమివ్వాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈసీ క్రిష్ణ పాల్గొన్నారు.

ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక కోర్సులు

శాంతిపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు యువతలో వృత్తి నైపుణ్యం పెంచి ఉపాధి అవకాశాలు పొందేలా చేయడానికి స్వల్పకాలిక కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్టు స్థానిక ఐటీఐ ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. ఐటీఐలో 45, 60 రోజుల కాల వ్యవధితో ఐదు ఉచిత కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. డొమస్టిక్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ వెల్డర్ కోర్సులు 45 రోజులు, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నిక్ కోర్సులు 60 రోజుల వ్యవధితో ఉంటాయన్నారు. ఆసక్తి గల యువతీయువకులు టెన్త్ క్లాస్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాటు బయోడేటాతో ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 8074564049, 9704624408 నంబర్లను సంప్రదించాలన్నారు.

గర్భిణులు పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లి: గర్భిణులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలని వైద్యాధికారి విజయ్ చంద్ర పేర్కొన్నారు. మండలంలోని జాలారిపల్లెలో బుధవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు ప్రతినెలా వైద్యాధికారి సలహాలను పాటించాలన్నారు. ఐరన్, కాల్షియం, విటమిన్ డి, ఫోలిక్‌యాసిడ్, అయోడిన్, డీహెచ్ఏ వంటి పోషకాలు ఉన్న ఆహారపదార్థాలను తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ



ఫ్యాన్‌ను అందజేస్తున్న దాత

చౌడేపల్లె: చిట్రెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారి నోషిత కృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని ఫ్యాన్‌ను విరాళంగా బుధవారం అందజేశారు. వేసవి కాలం మొదలవడంతో చిన్నారుల కోసం నోషిత తల్లి తేజశ్వని వితరణగా ఇచ్చారని అంగన్‌వాడీ కార్యకర్త నాగరత్న తెలిపారు. రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రెడ్డెప్ప, రాధమ్మ, శీనా పాల్గొన్నారు.

కల్లూరు హైస్కూలుకు బోరు మంజూరు



పూజా కార్యక్రమంలో సర్పంచ్, ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కల్లూరు హైస్కూల్లో నాడు–నేడులో భాగంగా బోరు మంజూరు చేయించినట్లు సర్పంచ్ నటరాజ తెలిపారు. 750 మంది విద్యార్థులు పాఠశాలలో తాగునీటికి ఇబ్బందిగా ఉండడంతో ఈవిషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి వెంటనే బోరు మంజూరు చేయించారు. బుధవారం బోరు వేయడానికి సర్పంచ్ పూజా కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం తాతయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రఫీ పాల్గొన్నారు.

బహిరంగ వేలం

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాలు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, ప్రైవేట్ బస్సులు, చెరువులకు బహిరంగ వేలం వేస్తున్నట్లు కమిషనర్ రవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే అభ్యర్థులు 17వ తేదీ ప్రవేశ రుసుము చెల్లించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పుంగనూరు ప్యాలెస్ ఆవరణలోకి వెళుతున్న భక్తజనం



మంగళంలో భక్తుల సందడి



మమ్మేలు గంగమ్మ తల్లీ

- కోలాహలంగా శ్రీసుగుటూరు గంగమ్మ జాతర
- గ్రామాల్లో విందువినోదాలతో సందడి

పుంగనూరు: జమీందారుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర రెండు రోజుల పాటు కోలాహలంగా పట్టణంలోను, గ్రామాల్లోనూ బుధవారం నిర్వహించారు. అమ్మవారికి తొలి, మలి పూజలు జమీందారులు నిర్వహించగా బెస్తవారు, యాదవ, తోటి కులస్తులచే పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని బజారువీధిలో నడివీధి గంగమ్మ, తూర్పు మొగసాలలో గంగమ్మ, బాలాజి థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూర్ బ్యాంకు వద్ద నలగంగమ్మ, బస్టాండులో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నలగంగమ్మ, కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మలను ఉంచి పట్టణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే విరూపాక్షి మారెమ్మను పట్టణంలో పల్లకిలో ఉంచి ఊరేగించారు. అలాగే మంగళం, పిచ్చిగుండ్లపల్లెల్లో గ్రామ పెద్దలు, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి దంపతులు తొలిపూజలు నిర్వహించారు. భక్తులు మట్టి కుండలకు మామిడి ఆకు, వేపాకు, పూలు పెట్టి గెరిగెలు తయారు చేసి మహిళలు, పురుషులు స్త్రీల వేషధారణతో వచ్చి ఆలయంలో మూడు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా బంధుమిత్రులతో కలిసి విందు వినోదాలతో సందడి చేశారు.

జాతర సందడి..

రెండు రోజుల జాతర సందర్భంగా పట్టణంలో ఎటు చూసినా మేళతాళాలతో వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు గుంపులు గుంపులుగా ప్యాలెస్‌లోకి వెళ్లారు. ప్యాలెస్ ఆవరణం జన సంద్రమైంది. భక్తి గీతాలతో పట్టణంలో సందడి నెలకొంది. ఆలయం ముఖద్వారం, ప్యాలెస్‌లోను, పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లోను అమ్మవారి చిత్రాలను విద్యుద్దీపాలతో తయారు చేశారు. అలాగే అమ్మవారి జాతరను ప్రత్యక్ష ప్రసారాలు చేశారు. డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ఈనెల 29 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం జరిగిన తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షల్లో రెండు సెంటర్లకు సంబంధించి మొత్తం 900మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 40మంది మినహా మిగిలిన వారు పరీక్షకు హాజరయ్యారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగుతుండడంతో పలు ప్రయివేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇక్కడ పరీక్షలకు హాజరయ్యారు. ఇలాఉండగా ఇంటర్ బోర్డు నిర్వాకం కారణంగా ఇక్కడి పిల్లలను పుంగనూరు సమీపంలోని శ్రీరామాపురం ప్రయివేటు కళాశాలలో సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడం, పట్టణం నుంచి సరిగ్గా ప్రయాణ సౌకర్యాలు లేక విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. దీనిపై స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ కన్నయ్యను వివరణ కోరగా సెంటర్ల అలాట్‌మెంట్ పూర్తిగా ఆర్ఐఓ ఆధ్వర్యంలో జరుగుతుందని తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

గంగవరం: బుధవారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మండలంలో ప్రశాంతంగా మొదలయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మండలంలో నాలుగు కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. మొదటి రోజు మొత్తం 1,764మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా 1,729మంది హాజరయ్యారు. కాగా నేటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

సదుంలో..

సదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 251 మంది విద్యార్థులకుగాను 208 మంది హాజరైనట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అల్లాబక్ష్ తెలిపారు. 43మంది గైర్హాజరయ్యారని చెప్పారు.



కుప్పం: పరీక్ష కేంద్రానికి పరుగులు తీస్తున్న విద్యార్థిని

12 మంది గైర్హాజరు

బైరెడ్డిపల్లె: మండలంలోని ఆదర్శపాఠశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలకు చెందిన 281 మంది విద్యార్థులకుగాను 269 మంది హాజరయ్యారు. తెలుగు సబ్జెక్టుకుగాను 11 మంది, సంస్కృతంలో ఒకరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 747 మంది హాజరు

పుంగనూరు: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 747 మంది విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం పట్టణంలో మూడు కేంద్రాల్లో పరీక్షలను నిర్వహణాధికారి మోహనాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మూడు సెంటర్లలో 782 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

కుప్పం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కుప్పం పట్టణంలో నాలుగు సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఎంఎఫ్‌సీ జూనియర్, ఒకేషనల్ జూనియర్, వికాస్ జూనియర్ కళాశాలల్లో, కుప్పం డిగ్రీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 1,700 మంది మొదటి రోజు పరీక్షకు హాజరైనట్లు అధికారులు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుప్పంరూరల్: మండలంలోని పరమసముద్రం బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మల్లేశ్వరి తెలిపారు. మార్చి 24వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, విద్యార్థి ఫొటో తీసుకెళ్లాలని చెప్పారు.

19న మండల మీట్

కుప్పం: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జానకమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అశ్విని అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు, సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఆమె కోరారు. సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందని ఆమె తెలిపారు. .

19న ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న ఉగాది పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 25మందికి ఉగాది పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

రామకుప్పం: స్థానిక కోదండరామనగర్ కాలనీలో మంగళవారం రాత్రి పల్సర్ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. పోలీసుల వివరాల మేరకు..పెద్దపంజాణి గ్రామం శ్రీనివాసులుకు చెందిన పల్సర్ ద్విచక్రవాహనాన్ని రామకుప్పం కోదండరామనగర్ కాలనీలో నివాసముంటున్న అతని అల్లుడు సూర్యప్రకాష్ వాడుకునేవారు. యథాప్రకారం ఇంటి కాంపౌండ్‌లో ద్విచక్రవాహనాన్ని పార్కు చేశాడు. అయితే బుధవారం ఉదయం నిద్రలేచి చూసేసరికి పల్సర్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు రామకుప్పం ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు కేసు నమోదు చేశారు.

మేజర్ ఉన్నికృష్ణన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం ఉన్నత పాఠశాలలో బుధవారం 2008వ సంవత్సరం నవంబర్‌లో ముంబయిలో జరిగిన దాడుల్లో తీవ్రవాదులను అంతమొందించడంలో సాహసం చూపి వీర మరణం పొందిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్‌కు నివాళులర్పించారు. ఆయన జయంతిని పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. పీడీ చిరంజీవి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన ఆముదాల, పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాలసముద్రం హైస్కూల్ ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా టీచర్లు కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పదో తరగతి విద్యార్థులను ఇంటి వద్ద కూర్చోపెట్టి చదివించాలన్నారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నిబంధనల మేరకు మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రంప్రసాద్, హెచ్ఎంలు గణపతి, పూర్వాణి పాల్గొన్నారు.



15జీడీఎన్62 : పాలసముద్రం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

వినియోగదారుల సమస్యలను పరిష్కరిద్దాం

చిత్తూరు రూరల్: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని డీఎస్‌ఓ శంకరన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. వస్తువుల క్రయవిక్రయాల్లోని లోపాలను గుర్తించాలన్నారు. వాటిని గుర్తించాలంటే ముందుగా ప్రజలకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. డీఎస్‌ఓ శేషచలరాజు, తూనికల కొలతల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌ఓ శంకరన్

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

వి.కోట: ప్రబోధ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఉగాది త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన జ్ఞాన తెలుగు క్యాలెండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి అందరికీ అర్థమయ్యే రతీలో రూపొందించారని తెలిపారు. ప్రబోధసేవా సమితి మండల అధ్యక్షుడు అశోక్ బాబు, సభ్యులు రవి, దిలీప్, హరి, ఉపాధ్యాయులు మురగన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

జోరుగా సిమెంట్ రోడ్ల నిర్మాణం



టి.వడ్డూరులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

- టి.వడ్డూరులో తీరిన మంచి నీటి సమస్య
- గ్రామంలో అభివృద్ధిని స్వాగతిస్తున్న ఇతర పార్టీ నేతలు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. మండలంలోని వెనుకబడిన పంచాయతీగా పేరొందిన ఇక్కడ సంచార జీవనం, వలసలు ఎక్కువగా ఉంటాయి. గత ప్రభుత్వంలో ఇక్కడ తాగేందుకు మంచినీటికి ఇబ్బందులు తప్పలేదు. గ్రామస్తులు పొలాల వద్దనున్న వ్యవసాయ బోర్లనుంచి మంచినీటిని తెచ్చుకొనేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచినీటి సమస్య పూర్తిగా తీరింది. ముఖ్యంగా గ్రామంలోని 880 మీటర్ల పరిధిలో వీధులకు సీసీ రోడ్లను నిర్మించారు. ఇప్పటిదాకా గ్రామంలో జెడ్పీ, మండల, గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా రూ.40 లక్షల వ్యయంతో వీటిని నిర్మించారు. మిగిలిన 500 మీటర్లకు త్వరలోనే సిమెంట్ రోడ్లను వేసేందుకు సర్పంచ్ మునస్వామి సమాయత్తమవుతున్నారు. దీంతో గ్రామంలో సాగుతున్న అభివృద్ధి పనులపై పంచాయతీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిని మెచ్చుకోవాల్సిందే..



నేను గత నాలుగేళ్లుగా బీజేపీ మండల కన్వీనర్‌గా పనిచేస్తున్నా. మా గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా నీటి సమస్య తీరింది. గతంలో మట్టి రోడ్లుగా ఉన్న వీధులన్నీ ఇప్పుడు సిమెంట్‌రోడ్లుగా మారాయి. మా గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం లాంటి పక్కాభవనాలు వెలిశాయి. నిజం చెప్పాలంటే వైఎస్సార్‌సీపీ పాలన చక్కగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

శరవణ, మండల బీజేపీ కన్వీనర్, టి.వడ్డూరు

ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌ల చొరవతోనే...



ఎంతో వెనుకబడిన మా గ్రామంలో చదువుకున్న వారు తక్కువ. సగం మంది వలసబతులకు అలవాటు పడ్డారు. కానీ ఈ మూడేళ్లలో చాలామంది స్వంత గ్రామానికి వచ్చి పనులు చేసుకుంటున్నారు. గ్రామంలో ముఖ్య సమస్య అయిన మంచినీటి సౌకర్యం కల్పించాం. ఇప్పుడు మూడు వీధులు మినహా అన్ని వీధుల్లో సీసీ రోడ్లను నిర్మించాం. ఇందుకు కారణమైన స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ వాసుకు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు రుణపడి ఉంటాం.

మునస్వామి, సర్పంచ్, టి.వడ్డూరు

వాటర్ ఫిల్టర్ల పంపిణీ



వాటర్ ఫిల్టర్లను అందజేస్తున్న ప్రతినిధులు

పలమనేరు: నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండలంలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక వాటర్ ఎయిడ్ ఎన్‌జీఓ ప్రతినిధులు పిల్లలకు స్వచ్ఛమైన నీటి కోసం వాటర్ ఫిల్టర్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ మాధవిలత, వాటర్ ఎయిడ్ బృంద సభ్యులు మంజుల, కుమారి, సరళ పాల్గొన్నారు.

బాలింతలు రక్త పరీక్షలు చేయించుకోవాలి

పూతలపట్టు: రక్తహీనతతో బాధపడే బాలింతలు క్రమం తప్పకుండా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని ఎస్‌బీసీసీ జిల్లా కో–ఆర్డినేటర్ గాంధీ అన్నారు. కలెక్టర్, డీఆర్‌ఓ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తలపులపల్లి సబ్‌సెంటర్, ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కౌమార బాలికలను గుర్తించి వారికి ప్రత్యేకంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించాలని ఏఎన్ఎంలకు తెలిపారు. న్యూట్రీషన్ ఫుడ్, దిశ చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు వైఎస్సార్ కిట్ తప్పనిసరిగా అందాలని కార్యకర్తలకు తెలిపారు.

IN THE COURT OF THE HONOURABLE III ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE (SITTING AT KGF)
M.V.C.No.50 / 2021

PETITIONER
Sri P. Ramoorthy (alias) Paranandi Ramoorthy. Aged about 57 years, S/o. Sri Narasimhaiah, R/at 1-79 A, Kongatam Village Kuppam Taluk, chittor District, Now residing at 8th Cross, Swarna Nagar, Robertsonpet, Kolar Gold Fields-563122.

- VS -

DEFENDANTS
1. Sri Srinath Aged about 35 Years, S/o. Sri Selvam, R/at NTR Colony, Kuppam Chittoor District.
2. Smt. Kadiyala Subhashini,, W/o. Sri V.G. Chinni, R/at No. 14-142, Radhakrishna Road, Kuppam, Chittoor District.
3. Oriental Insurance Company Ltd No. 8-1-210, P.H.Road, Opp: District Court, Chittoor-517001.

NOTICE
WHEREAS the Petitioner above named has filed the above case for compensation and other reliefs in respect of motor vehicle accident against the respondents.
Notice is issued to the first respondent above named to appear in person or through authorized representative to answer all the questions in regard to the above matter on 4/4/2023 at 11.A.M. Failing to appear on the date mentioned above the matter will be proceeded as per law, which may be noted.

BY ORDER OF THE COURT
Sd/- CHIEF MINISTRSTAL OFFICER
Court of Honourable III Addl. District and Sessions Judge (Sitting at KGF)
N. Ashoka, Advocate, Kolar
Place: K.G.F.
Dated: 10/03/2023